

## వంతెన పనులను చేపట్టాలని డీసికి వినతి

**డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించండి**

**నాగారం, మే 25 (జనం వార్త) :** నాగారం డివిజన్ పరిధి హరితపురి కాలనీ, విజయపురి కాలనీ మధ్యలో ఉన్న వనిత వంతెన(బ్రిడ్జి) పనులను చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో భారీ వర్షాలకు వంతెన కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా రాంపల్లి పరిధిలోని రెండు పడక గదుల ప్రాంతంలో ప్రజలకు సరైన వసతులు కల్పించాలని ముప్పు శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ కమీషనర్ ను కోరారు. ఆమె వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవన్ రెడ్డి, పర్వత్ రెడ్డి పాల్గొన్నారు.



## నాగారంలో జలమండలి అధికారుల తనిఖీ

**విద్యుత్ మోటార్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు : సాయికిరణ్ గౌడ్**

**నాగారం, మే 25 (జనం వార్త) :** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నాగారం ఓల్డ్ విలేజ్ లో తక్కువ నీటి ఒత్తిడి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జలమండలి అధికారులు వెంటనే పరిగణలోకి తీసుకున్నారు. సోమవారం నాగారం డివిజన్ జరమండలి మేనేజర్ సాయికిరణ్ గౌడ్ సరఫరా సమయంలో లైన్‌మెన్‌లతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కొంతమంది వినియోగదారులు అక్రమంగా నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు. సమస్యను గుర్తించిన వెంటనే అధికారులు విద్యుత్ మోటార్లను తొలగించి, సాధారణ నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మేనేజర్ సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సమానంగా నీటి సరఫరా అందించడమే మా లక్ష్యం అన్నారు. నీటి బకాయిలను వెంటనే చెల్లించి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్ మోటార్లను ఉపయోగించి నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ముదిరాజుల సింహావలోకనం సదస్సును విజయవంతం చేయండి

**గోడపత్రికలను ఆవిష్కరణ**

**కుషాయిగూడ, మే 25 (జనంవార్త) :** జలవిహార్‌లోని గ్రాండ్ లైన్స్‌లో ముదిరాజ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నేడు నక్లెస్ రోడ్ లో జరగనున్న "ముదిరాజుల సింహావలోకనం" సదస్సును విజయవంతం చేయాలని కుషాయిగూడ ముదిరాజ్ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు చక్రిపురం చౌరస్తాలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పిట్టల నాగరాజు ముదిరాజ్, కార్యదర్శి గడ్డల పాండు ముదిరాజ్ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్,ఎంపీ ఈటల రాజేందర్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ముదిరాజుల సమస్యల పరిష్కార, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సదస్సులో కీలక చర్చ జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో ముదిరాజులు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని,వెనుకబడిన కులంగా ఉన్నారని స్పష్టమైందని నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నాయకులు శగాంటి రవి,బొల్లా శ్రీనివాస్, కొలిపాక కనకయ్య, రెడ్డబోయిన రాజు, పిట్టల భరత్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ ప్రతినిధి, మే 25:** మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రం, మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామం, దామరచర్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న విలేజ్ ఆర్గనైజేషన్ (వూా) మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా సంఘాల అభివృద్ధి, సాధికారతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా

- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే
- నగరంలో 24 గంటల కరెంటు, తాగునీటిని అందిస్తాం
- కెసిఆర్ దూరదృష్టితో నగరానికి నాలుగు దిక్కుల వేయి పడకల టీమ్స్ ఆస్పత్రుల నిర్మాణం
- మేము చేసిన అభివృద్ధి పనులకు ముఖ్య మంత్రి ప్రారంభోత్సవాలు
- బిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల జోలికొస్తే సహించే ప్రసక్తే లేదు
- నాయకుల చుట్టూ కాదు ప్రజల చుట్టూ తిరిగే నాయకులకే కార్పొరేటర్ టికెట్లు
- కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం
- కూకట్‌పల్లి బిఆర్ఎస్ కార్యకర్తలు నిబద్ధత కలిగిన కార్యకర్తలు
- కూకట్ పల్లి బిఆర్ఎస్ నాయకుల,కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్



**కూకట్‌పల్లి, మే 25, (జనం వార్త) :** హైదరాబాద్ మహా నగర్ లోని నిరుపేదలను ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇచ్చినట్లు చూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి సవాలు విసిరారు. సోమవారం కూకట్ పల్లి ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్ లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగి పోయారని రాబోయేది బి ఆర్ ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలో 24 గంటలు తాగునీటిని అందిస్తామని ఆయన ప్రకటించారు. బి ఆర్ ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు ముఖ్య మంత్రి ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఏద్దేవా చేశారు. కెసిఆర్ దూరదృష్టితో నగరానికి నాలుగు దిక్కుల వేయి పడకల టీమ్స్ ఆస్పత్రుల నిర్మాణం



చేశారని అయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. . నిజాం నవాబ్ నిర్మించిన ఆసుపత్రులు తప్ప గత 65 ఏళ్లలో పాలించిన ప్రభుత్వాలు నగరంలో కొత్తగా ఏ ఆసుపత్రిని నిర్మించలేదని, రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కెసిఆర్ దూరదృష్టితో నగరానికి నాలుగు దిక్కుల వేయి పడకల టీమ్స్ ఆస్పత్రుల నిర్మానానికి పూనుకున్నాం న్నారు. మా ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తయిన ఆసుపత్రులను ఈ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తున్నారనిఆయన విమర్శించారు. దేశం మొత్తం కాంగ్రెస్ ను చిదరించుకుంటే తెలంగాణ ప్రజలు మాత్రం ఎందుకో అధికారం ఇచ్చారని, పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రజలు సైతం బొంద పెట్టారని ఎద్దేవ చేశారు. మా ప్రభుత్వ హయాంలో నగరంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తో జీవన ప్రమాణాలు పెరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిందని, బిఆర్ఎస్ పాలనలో నగరంలో 42 ఫ్లైఓవర్లు, లింక్ రోడ్లు, అండర్ పాసులు నిర్మించామన్నారు. కష్టకాలంలో అండగా ఉన్న ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలో లేనప్పటికీ ఏ కార్పొరేటర్ పార్టీ మారకుండా కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు, మీలాంటి నిబద్ధతగల నాయకులు కార్యకర్తలు టిఆర్ఎస్ కు బలమని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులకు హెచ్చరించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నాయకుల చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరిగే నాయకులకే కార్పొరేటర్ టికెట్లు ఇస్తామని ఆయన సూచించారు. 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని ఒక్క హామీని కూడా పూర్తి చేయలేదన్నారు . నగరంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ల ఇల్లును నిర్మిస్తే గుంపు మేస్త్రిని అని చెప్పుకునే ఈ ముఖ్యమంత్రి ఒక్కటంటే ఒక్క ఇల్లు నిర్మించలేదని ఒక్క ఇల్లు నిర్మించినట్టు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. శని ఆదివారాలు వస్తే హైడ్రా ఎక్కడ ఏ ఇల్లు కూల్చివేస్తుందోనని ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారని, ఈ ప్రభుత్వానికి కూల్చడం తప్ప నిర్మించే ఆలోచనలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కేటీఆర్ కార్యకర్తలకు ఎస్ఐఆర్ పై పూర్తి అవగాహన కల్పించడంలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ప్రతి డివిజన్ లోని బూత్ లెవెల్ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించి ఓట్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ బి ఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ నాయకత్వంలో కూకట్ పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశామని, రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టక పోవడమే కాక బి ఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను తామే చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ ,ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, నాయకులు గజ్జల నాగేష్, రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ , మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, పగుడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి ,మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు సెక్రెటరీలు,మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పంట అవశేషాల కాల్చివేత్తలపై అవగాహన సదస్సు



**చింతకాని, మే 25:** తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో పంట అవశేషాలపై కాల్చివేత్తలపై అవగాహ న సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు. జగన్నాధపురం రైతు వేదిక అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కార్తీక్‌గా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ భూమిని సారవంతంగా ఉండేవిధంగా చూసుకోవాలి. పంట సాగులో దిగుబడులు పెరగాలంటే పతి రైతు నేలను కాపాడుకోవాలి. వ్యర్థాలను కాల్చడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మ జీవులు నశిస్తున్నాయి. దీంతో పెట్టుబడులు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. చీడపీడల ఉత్పత్తులు సైతం పెరుగుతుంది. నేల పరిరక్షణతో పాటు వాతావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు బాధ్యత అని తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తెలియజేశారు. ఏ ఈ ఓ కార్తీక్ మాట్లాడుతూ పంట కోతల తర్వాత మిగిలే వ్యర్థాలను పొలాల్లో కాల్చడం వల్ల నేల సారవంతం దెబ్బతినడమేకాక, పర్యావరణానికి యు మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ ప్రమాదకరమైన పద్ధతిని నివారించడానికి వ్యవసాయ శాఖ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. పంట అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలుభూసారం లో మంటల తీవ్రతకు నేలలోని నత్రజని భాస్వరం ,పొటాషియం వంటి విలువైన పోషకాలు ఆవిరైపోతాయి మిత్ర సూక్ష్మజీవుల మరణం భూమికి మేలు చేసే బ్యాక్టీరియా, వానపాములుఇతర సూక్ష్మజీవులు మంటల్లో కాలి మట్టి గట్టిపడుతుంది. కాలుష్యం – అనారోగ్య సమస్యలు పొలాలు కాల్చడం వల్ల గాలి కాలుష్యం విపరీతంగా పెరిగి, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. రైతులకు హెచ్చరిక ప్రత్యామ్నాయాలు భారీ జరిమానా నిబంధనలను ఉల్లంఘించి పొలాల్లో పంట అవశేషాలను తగులబెట్టే రైతులకు వ్యవసాయ శాఖ జరిమానా విధిస్తుంది. ప్రత్యామ్నాయ పద్ధతులు పంట వ్యర్థాలను కాల్చేయడానికి బదులుగా, వాటిని రోటోవేటర్ లేదా మల్చర్ సాయంతో భూమిలోనే కలియదున్నాలి. దీనివల్ల వ్యర్థాలు కుళ్లిపోయి భూమికి మంచి సేంద్రీయ ఎరువుగా మారుతాయి. పంట అవశేషాల కాల్చివేతపై జరిమానా విధించే అవకాశం ఉందని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కార్తీక్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వనదేవతలను దర్శించుకున్న కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ములుగు జిల్లా, మే 25:** ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నేడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మేడారంని సందర్శించి వనదేవతలైన సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ములుగు జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ వనదేవతలను వేడుకున్నాను. అదేవిధంగా ప్రస్తుతం ములుగు జిల్లాను పాలిస్తున్న పాలకులకు ప్రజల సంక్షేమం పట్ల సరైన ఆలోచన మంచి బుద్ధిని ప్రసాదించాలని జిల్లా అభివృద్ధిని విస్మరించకుండా ప్రజల సమస్యలను తీర్చేలా వారిలో మార్పు తీసుకురావాలని ఆ సమ్మక్క సారలమ్మలను ప్రత్యేకంగా ప్రార్థించాను అని వారు తెలపడం జరిగింది. కార్యక్రమంలో ఏటురూనాగారం పి ఏ సి ఎస్ చైర్మన్ కునూరు అశోక్ గౌడ్ కాటాపురం సర్పంచ్ దిడ్డి మోహన్ రావు యదిరెడ్డి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తాటి కృష్ణ తాడూరి రఘు చిట్టిమల్ల సమ్మయ్య మైపాల్ రెడ్డి ఇంద్రారెడ్డి



యలవర్తి శ్రీనివాసరావు మువ్వా భాను మానుకొండ నవీన్ ఠాకూర్ సురేందర్ సింగ్ మహేష్ జిల్లా మరియు స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాజంలో మార్పు తెచ్చే శక్తి యువతకు ఉంది

**● యువత పాలకులుగా ఎదగాలి ● టిఆర్పి నేత తీన్మార్ మల్లన్న**

**రంగారెడ్డి ప్రతినిధి, మే 25:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ( టి ఆర్ పి ) కేంద్ర కార్యాలయంలో చెంగిచెర్ల పార్టీ 12వ డివిజన్ అధ్యక్షుడు కోరే శరత్ బాబు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన యువత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో పెద్ద ఎత్తున పార్టీలో చేరారు ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న కండువా కప్పి సాదరంగా వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకు రాగలిగే శక్తి ఒక్క యువతకే ఉందని అన్నారు యువశక్తి తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని ఇంత పెద్ద ఎత్తున యువత ముందుకు రావడం శుభ పరిణామం అని అన్నారు. యువత కేవలం ఓటర్లుగానే మిగిలిపోకుండా రేపటి తరం పాలకులుగా నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి యువత ఉత్సాహం వారి వినూత్న ఆలోచనలు పార్టీకి సరికొత్త ఊపును ఇస్తాయని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ నిర్మూలన ఉపాధి అవకాశాల కల్పనతో పాటు యువత భవిష్యత్తుకు టీఆర్పీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్థానిక ప్రజా సమస్యలపై యువత క్రియాశీలక పాత్ర పోషించి పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్ రాష్ట్ర కోఆర్డినేటర్ లింగం యాదవ్ పార్టీలో చేరిన యువత సందీప్ చందా దినేష్ భార్గవ్ సురేందర్ ఆనంద్ గణేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### టిఆర్పి లో పెద్ద ఎత్తున మహిళల చేరిక

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నరసయ్య గౌడ్ జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన మహిళలు ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు టిఆర్పి చైర్మన్ తీన్మార్ మల్లన్న కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఏ సమాజంలోనైనా మహిళలు మేల్కొన్నప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చునని మహిళల సైనికురాళ్ల తోనే తెలంగాణ రాజ్యాధికారం సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు పేదలు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న తమ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో తరలిరావడం కొండంత బలం ఇస్తుందని రాబోయే రోజుల్లో మహిళా శక్తిలోనే పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు పార్టీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు బంధారపు నరసయ్య గౌడ్ పొనగట్ల చక్రపాణి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు సామాన్యుల కు ఎక్కడ అన్యాయం జరిగినా అండగా నిలబడే నాయకుడు తీన్మార్ మల్లన్న అని కొనియాడారు మేడ్చల్ మల్కాజిగిరి మహిళా అధ్యక్షురాలు నీరు శాలిని ఉపాధ్యక్షురాలు జాలిగేకు సౌభాగ్య మహిళా కార్యదర్శి చందం వనజ మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

